క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలపై సమీక్ష



సీసీ కెమెరాల పనితీరుపై సమీక్షిస్తున్న జేసీ లావణ్యవేణి

దెందులూరు: దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత మూడంచెల భద్రతా అధికారులు, ఉద్యోగులపై ఉందని జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బీ.లావణ్యవేణి అన్నారు. శుక్రవారం దెందులూరు నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు ఉన్న సీళ్లను, సీసీ కెమెరాల పనితీరుపై మూడంచెల భద్రత ఉద్యోగులతో అంశాల వారీగా సమీక్షించారు. రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సందర్శకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈవీఎం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్రకుమార్ ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి

పెదపాడు: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలలకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందిస్తున్న నేపథ్యంలో వాటిని సక్రమంగా పాఠశాలలకు చేర్పించాలని సూచించారు. ఎన్నికల కోడు అమలు ఉన్నందున ఎలాంటి తీర్మానాలు చేయడం వీలుకాదన్నారు. అధికారులు ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్ పెదపాడు మండల ఉపాధ్యక్షురాలు అప్పన పద్మావతి, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్, ఎంపీటీసీ అక్కినేని గోపి చంద్ర దుర్గాప్రసాద్ ఎంపీడీవో జె తేజ రతన్, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

కాలభైరవి ఆలయంలో అన్నసమారాధన

పెదవేగి : పెదవేగిలో వేంచేసియున్న కాలభైరవి అమ్మవారి తిరునాళ్ల ముగింపు సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఐదు రోజులుగా అమ్మవారి ఆలయంలో తిరునాళ్ళు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌తాతా శారద, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

దెందులూరు: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా దోసపాడులో మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. గ్రామస్తులు ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలను నిలుపుదల చేశారు. దోసపాడులో 109 సర్వే నంబరులో అనుమతుల్లేకుండా మట్టి తవ్వి తరలిస్తుండగా శుక్రవారం అడ్డుకున్నామని తెలిపారు. అప్పటికే కొన్ని ట్రిప్పులు మట్టిని తరలించినట్టు గుర్తించామన్నారు. గ్రామస్తులు ఫిర్యాదు అందించిన వెంటనే ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించినట్టు పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిక అందించామని దోసపాడు వీఆర్వో సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో వివిధ వృత్తి విద్య కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతులకు ఫ్యాషన్ డిజైనింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. 5వ తరగతి ఆపైన విద్యార్హత గల గ్రామీణ ప్రాంత యువతులకు ఈ నెల 27 నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల యువతులకు శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 95027 23561, 99485 65256 నంబర్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారు శిక్షణకు వచ్చే సమయంలో ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు మూడు కలర్ పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

నాణ్యమైన బోధనతో ఉత్తమ ఫలితాలు

- విద్యాప్రమాణాల పెరుగుదలకు అధ్యాపకుల సమష్టి కృషి
- స్టేట్ టాపర్‌గా నిలిచిన నారాయణపురం కాలేజి విద్యార్థి అజయ్‌రాజు
- ఈ ఏడాది పెరుగుతున్న అడ్మిషన్లు





నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు



కళాశాలలోని ఆర్వో ప్లాంటు

ఉంగుటూరు: ప్రైవేటు కళాశాలకు దీటుగా నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ కళాశాలలో విద్యాప్రమాణాల పెరుగుదలకు అధ్యాపకులు చేస్తున్న కృషి చేస్తూ నాణ్యమైన బోధన అందించడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయి. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటుతున్నారు. ఈ కళాశాలలో చదివిన హెచ్ అజయ్‌రాజు అనే విద్యార్థి ఇంటర్ ఎంపీసీ విభాగంలో 985 మార్కులు సాధించి, జిల్లా స్థాయిలో ప్రథమం, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అధ్యాపకులు ఒక టీముగా ఏర్పడి విద్యార్థుల విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు క్రమపద్ధతిలో చదువు బోధిస్తున్నారు. అజయ్‌రాజుకు వచ్చిన మార్కులతో రాష్ట్రస్థాయిలో ఇంటర్‌లో చేరబోయే విద్యార్థుల దృష్టి ఈ కళాశాల వైపు పడింది. ఈ కళాశాలలో చదివిన విద్యార్థుల్లో సీనియర్ ఇంటర్‌లో జి.హసిని 931, పి. భారతి 901, టి. తేజశ్రీ 874, దీపిక 867, పి.సంగీత 857, పి.ప్రసన్నకుమారి 850, ఎ.మేఘన 760 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. ఇంటర్



తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు

ప్రథమ సంవత్సరం చదివిన పి. సంధ్య 474, విజయరాజు 435, ఎం. హర్షిత 400, పి.ప్రశాంతి 456, వై.చిన్నారి 337 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు.



బాలురు, బాలికలుకు ప్రత్యేకంగా నిర్మించిన టాయిలెట్లు

నాడు– నేడు పథకంలో కళాశాలలో అభివృద్ధి పనులు

నాడు –నేడు పథకంలో కళాశాల భవనాలు కొత్త రూపును సంతరించుకున్నాయి. విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక టాయిలెట్లు నిర్మించారు. రక్షిత నీటిని అందించేందుకు రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. సౌకర్యవంతమైన బెంచీలు ఏర్పాటు చేశారు. డిజిటల్ బోధనకు అవసరమైన ఉపకణాలు, తరగతి గదుల్లో ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సదుపాయాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ కళాశాలలో ఇంటర్ చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకేషనల్ ఆర్జేడీ ప్రభాకరరావు ఈ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసు పర్యవేక్షణ, అధ్యాపకులు కష్టపడి బోధించడం తదితర అంశాలు ఉత్తమ ఫలితాలు రావడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

సీట్ల కేటాయింపు ప్రారంభం



పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు పొందటానికి ఇప్పటికే దరకాస్తులు చేసుకున్నారు. ఇంకా దరఖాస్తులు వస్తున్నాయి. ఈనేపథ్యంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో చేరగోరే వారికి సీట్లు కేటాయించే ప్రక్రియ ప్రారంభించాం. కళాశాల విద్యార్థులకు జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి ర్యాంకులు రావడంతో ఈ ఏడాది అడ్మిషన్లు పెరగనున్నాయి. ఆ దిశగా కార్యాచరణ చేసినట్లు తెలిపారు.

– శ్రీనివాసు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్

వైభవంగా వేంకటేశ్వరస్వామి పుష్పోత్సవం

- కనుల పండువగా కోవెల ప్రదక్షిణలు
- 26వ తేదీతో ముగియనున్న కల్యాణోత్సవాలు



గుండుగొలనులో విశేషంగా ముస్తాబైన కలియుగ వెంకన్న స్వామి, అమ్మవార్లు



పల్లకీలో కోవెల ప్రదక్షిణలు చేస్తున్న స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న ట్రస్టీ దంపతులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు కనుల వేడుకగా సాగుతున్నాయి. దేవదాయధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం, కోవెల ప్రదక్షిణలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వార్లను విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సుందరంగా ముస్తాబైన ఓ పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, మోహనకృష్ణాచార్యులు, సుధీరాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పవళింపు సేవ నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు స్వామి వారి వెంట కోవెల ప్రదక్షిణలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈనెల 26న ఆలయం వద్ద స్వామి వారి అన్న వితరణ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో వంశీ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన



దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కల్నల్ యాకు



దెందులూరు కల్నల్ దంపతులకు ఘన స్వాగతం పలుకుతున్న కోర్ ఆఫీసర్ రమణయ్య తదితరులు

దెందులూరు: దెందులూరులో 125 ఏళ్ల ఆధ్యాత్మిక విశిష్ట సేవలు అందించిన సాల్వేషన్ ఆర్మీ చర్చి స్థలంలో నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని సాల్వేషన్ ఆర్మీ కల్నల్ యాకుబ్ మసీ, సుమిత్రా మసీ అన్నారు. శుక్రవారం డివిజనల్ కమాండర్ జే.మోషే, దెందులూరు సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ కె.రమణయ్య, లెఫ్టినెంట్ కల్నల్ జోషియా, సంఘస్తులు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే చర్చికి శంకుస్థాపన చేశారు. తొలుత కల్నల్ యాకుబ్ మసీ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి కావాలని, మరింత దేవుని ఆధ్యాత్మిక సేవ విస్తృత పరిచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సమష్టి కృషి, నిరంతర ప్రార్థన, సంకల్ప బలంతో సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. దెందులూరు కోర్ ఆఫీసర్ రమణయ్య, లెఫ్టినెంట్ కల్నల్ జోషియా, సంఘస్తులు, దాతల శ్రమను, సేవలను కల్నల్ దంపతులు ప్రత్యేకంగా కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా దెందులూరు విచ్చేసిన కల్నల్ దంపతులకు దెందులూరు కోర్ సంఘస్తులు అపూర్వ స్వాగతం పలికారు. దెందులూరు బస్టాండ్ సెంటర్ నుంచి ప్రత్యేక వాహనంపై మేళతాళాలతో పూలు చల్లుతూ ఊరేగింపుగా క్రైస్తవ గీతాలాపానలతో శంకుస్థాపన స్థలానికి తీసుకువెళ్లారు. అనంతరం కల్నల్ దంపతులను లెఫ్టినెంట్ కల్నల్ జోషియా, సంఘస్తులు ఘనంగా సత్కరించారు. డివిజనల్ సెక్రటరీ జాకోబు, డీవైఎస్ పీ.శ్యామ్‌కుమార్, తెలంగాణ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ పళ్ళె హర్షవర్ధన్, సేవ్ మిషన్ డైరెక్టర్ ఎం.నికోలా, సంఘస్తులు కొంగర కిరణ్, అంజలి, సామ్యూల్, నక్కా ఏసురత్నం తదితరులు ఇతర ప్రాంతాల కోర్ ఆఫీసర్లు ఉన్నారు.

వ్యవసాయ విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన



నడిపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదవేగి : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో మార్కాపురం వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు పర్యటిస్తున్నారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ డి శ్రీనివాస్ పలు అంశాలను విద్యార్థులకు ఉద్బోధించారు. శుక్రవారం గుంటూరు పరిధిలోని ఏరువాక కేంద్ర బృందం ఏలూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మార్కాపురం ఎన్‌ఎస్ వ్యవసాయ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులను పెదవేగి మండలం నడిపల్లిలో, లింగపాలెం, మండలం తోచిలక, రాయుడుపాలెంలో గ్రామీణ ప్రాంత రైతులు సాగుచేసే వ్యవసాయ పంటల సాగు పద్ధతులను పరిశీలించారు. విద్యార్థులు రైతు సదస్సులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి షేక్ భాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్‌వీఎస్‌కే రెడ్డి, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త ఎన్.నాగేంద్ర బాబు, పెదవేగి ఏఓ ప్రియాంక, నడిపల్లి ఆర్‌బీకేవీ ఏఏ లహరి, తదితర వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు

ప్రశాంతంగా టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



భీమడోలులో నోటీస్ బోర్డులో హాల్ టికెట్లు, కేటాయించిన గదుల వివరాలు పరిశీలిస్తున్న విద్యార్థులు



విద్యార్థులను చెక్ చేసి పరీక్ష కేంద్రంలోని పంపుతున్న అధికారులు, మహిళా కానిస్టేబుల్

భీమడోలు: మండలంలో భీమడోలు, పోలసానిపల్లి పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్ష రెండు పరీక్షా కేంద్రాల్లో 159 మంది రాయాల్సి ఉండగా 58 మంది మాత్రమే పరీక్ష రాసారు. భీమడోలులో 90 మంది విద్యార్థులకు 38 మంది, పోలసానిపల్లి గురుకుల బాలికల కళాశాలలో 69 మందికి 20 మంది మాత్రమే పరీక్షలు రాసారు. దీనితో 101 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. తొలుత పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసే విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లు, కేటాయించిన తరగతి గదుల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ఏర్పాటు చేసి పోలీస్ పహారా ఉంచారు. పరీక్షా కేంద్రానికి వెళ్లే ప్రతి విద్యార్థిని చీఫ్ సూపరిండెంటెంట్ అహ్మద్, డీవో డి.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు విద్యార్థులను పరిశీలించి లోపలికి పంపారు. జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పోలసానిపల్లి గురుకుల కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్షను ప్రథమ సంవత్సరం విద్యార్థులు 31 మందికి 28 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11 మందికి 9 మంది హాజరయ్యారు. జూన్ ఒకటవ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పెదపాడు మండలానికి వచ్చిన పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న పెదపాడు ఎంఈఓ డీవీరమణ



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న దెందులూరు ఎంఈవో అన్నమ్మ

పెదపాడు: మండంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 20207 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు పెదపాడు ఎంఈఓ డీవీరమణ తెలిపారు. శుక్రవారం పెదపాడులోని స్టాక్‌పాయింట్‌కు 8,9, 10వ తరగతి విద్యార్థులకు అన్ని పాఠ్యపుస్తకాలు వచ్చాయని, వాటిని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

8, 9, 10 తరగతుల పాఠ్య పుస్తకాలు సిద్ధం

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల తెరిచే సమయానికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని దెందులూరు ఎంఈఓ–2 కే. అన్నమ్మ అన్నారు. శుక్రవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో జిల్లా కేంద్రం నుంచి వచ్చిన పాఠ్య పుస్తకాలను స్టోర్ రూమ్‌లో భద్రపరిచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దెందులూరు మండలంలో 8 తరగతికి 495 పుస్తకాలు, 9వ తరగతికి 606 పుస్తకాలు, 10వ తరగతికి 567 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల మేరకు ప్రధానోపాధ్యాయులు పాఠశాల పునఃప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించాలని ఎంఈఓ సూచించారు.

నేరాల నియంత్రణకు కార్డెన్ సెర్చ్



భీమడోలులో పాత ఇనుప దుకాణంలో పరిశీలిస్తున్న ఎస్సైలు సుధాకర్, సతీష్



భీమడోలులో ఓ సంచిని పరిశీలిస్తున్న ఎస్సై సుధాకర్



సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న సీఐ శ్రీనివాసకుమార్, ఎస్సై స్వామి

భీమడోలు: ఎన్నికల పోలింగ్ ముగిసి కౌంటింగ్ సమీక్షిస్తున్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలులోని బీసీ, ఇందిరా కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. భీమడోలు, ద్వారకాతిరుమల ఎస్సైలు వై.సుధాకర్, సతీష్, సిబ్బంది కలిసి వెళ్లి ఆ ప్రాంతాల్లోని అనుమానాస్పదంగా గృహాలు, దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాత సామగ్రి దుకాణాన్ని పరిశీలించారు. సంబంధిత వ్యక్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి సామగ్రికి తగిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలని యాజమానులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్, ఆ తర్వాత గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు వచ్చే అపరిచిత వ్యక్తులపై ప్రజలు అప్రమత్తతతో ఉండి సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. రికార్డులు లేకుండా ఉన్న బైక్‌లు, సామగ్రిని స్వాధీనం చేసుకుంటామన్నారు. నేరాలను అదుపులో ఉంచేందుకు ఈ కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోని అనుమానాస్పద ఏరియాలతో పాటు ఇళ్లను తనిఖీ చేస్తామని తెలిపారు. ఎటువంటి అనుమానం వచ్చినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పారావుపాలెం కార్డెన్ సెర్చ్

దెందులూరు: మండలంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి అప్పారావుపాలెం, జోగన్నపాలెం వంతెన వద్ద పెదవేగి సీఐ పీ.శ్రీనివాసకుమార్, దెందులూరు ఎస్సై కె.స్వామి కేంద్ర సాయుధ బలగాలతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన కాగితాలు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనాల యజమానులు ఇంటి నుంచి బయలుదేరినప్పుడు వాహనాలకు సంబంధించిన పత్రాలు, హెల్మెట్ తీసుకురావాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుళ్లు హమీద్, గోపి ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



అంబర్‌పేటలో కిషోర్ బాలికలకు మాసిక మహోత్సవంపై అవగాహన కల్పిస్తున్న భీమడోలు ప్రాజెక్టు అధికారిణి కేవీ విజయలక్ష్మి

భీమడోలు: వ్యక్తిగత పరిశుభ్రత వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఐసీడీఎస్ భీమడోలు ప్రాజెక్టు అధికారిణి కేవీ విజయలక్ష్మి అన్నారు. భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంబర్‌పేటలో శుక్రవారం మాసికా మహోత్సవంలో భాగంగా కిషోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, పోష్టిక ఆహారం తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నూర్జహాజ్ బేగం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీవో కేవీ విజయలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో కిషోర బాలికలు అనారోగ్య సమస్యల బారిన పడడానికి ప్రధాన కారణం లోపించిన వ్యక్తిగత పరిశుభ్రత వల్లే అన్నారు. పోషక విలువలు గల ఆహారాన్ని భుజించకపోవడంతో రోగనిరోధక శక్తిని కోల్పోయి రోగాల బారిన పడుతున్నారన్నారు. సరైన ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కిషోర బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ చూపితే శక్తివంతమైన సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. మహిళలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడు ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని భుజించకుంటే తీవ్ర ఆనర్థాలను ఎదుర్కొంటారన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. యువతులకు 18 ఏళ్లు, యువకులుకు 21 ఏళ్లు వివాహ వయస్సు కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో గుట్టుగా బాల్య వివాహాలు చేస్తే సమాచారం అందించాలని కోరారు. అంగన్‌వాడీలు సంతోషమ్మ, పావని, రాజ్యలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజల దాహార్తి తీర్చడానికి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమని జేసీ బి.లావణ్యవేణి అన్నారు. శుక్రవారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులు ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.